ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 2 జూన్ 2024





ఎగ్జిట్ పోల్ కేక

నిన్నటివరకు సందిగ్ధంలో ఉన్న పందెపురాయుళ్లు జోరు పెంచారు. ఈ ఎన్నికల్లో ఓటరన్న నాడిని సరిగ్గా పట్టలేక నిన్నటివరకు స్తబ్దుగా ఉండగా, ఎగ్జిట్ పోల్స్ విడుదల కావడం, చాలా సర్వేలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జెండా ఎగరేయడంతో నేడు రెండు జిల్లాల్లో మళ్లీ పందేల ఊపు పెంచారు. కొందరు కూటమి విజయావకాశాలపై రూ.కోట్లలో పందేలు కడుతుండగా, ఇంకొందరు మాత్రం వైసీపీకి అనుకూలంగానే ముందడుగు వేస్తున్నారు.

రెండు జిల్లాల్లో పెరిగిన బెట్టింగ్‌లు

- కూటమి విజయావకాశాలపై పందెపురాయుళ్లలో జోష్
- టీడీపీ గెలుపుపై గొల్లపూడిలో రూ.2 కోట్ల పందెం
- వైసీపీదే అధికారమంటూ రూ.75 లక్షలు
- గతంలో కంటే అదనంగా టీడీపీ నేతల పందేలు
- రూపాయికి రెండు రూపాయలు ఇస్తామని ఆఫర్లు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సుమారు 20కిపైగా సర్వే సంస్థలు శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించాయి. వీటిలో అత్యధికం కూటమి వైపే మొగ్గు చూపాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 14 స్థానాల్లో తిరువూరు, పామర్రు మినహా మిగిలిన అన్ని స్థానాలు కూటమి ఖాతాలోనే పడతాయని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, కొన్ని సంస్థలు వైసీపీ వైపు మొగ్గు చూపాయి.

మళ్లీ జోరు

వాస్తవానికి రెండు జిల్లాల్లో ఎన్నికలు ముగిసిన వెంటనే రంగంలోకి దిగిన బెట్టింగ్‌బాబులు దూకుడు ప్రదర్శించారు. పోలింగ్ ముగిసిన వారంలో సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగ్‌లు కాశారు. ఆ తర్వాత ఫలితాలను విశ్లేషించుకుని జోరు తగ్గించారు. బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలను చేతిలో పట్టుకుని విశ్లేషించుకోవడం మొదలుపెట్టగానే, బెట్టింగ్ బాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. బయట జరుగుతున్న ప్రచారానికి, తమ విశ్లేషణల్లో వస్తున్న ఫలితాలకు పొంతన లేకపోవడంతో బెట్టింగ్ బాబులు సందిగ్ధంలో పడ్డారు. తొలుత రూపాయికి రెండు రూపాయిల పందేలు నడవగా, ఇప్పుడు రూపాయికి రూపాయి కట్టేందుకూ ముందుకు రావడం లేదు. చాలామంది 10 శాతం వదిలేసుకుని డబ్బు వెనక్కి తీసేసుకున్నారు. ఎగ్జిట్ పోల్స్ వెల్లడితో మళ్లీ బెట్టింగ్ బాబులు తెరపైకి వచ్చారు. ఆరా మస్తాన్ వంటి వారి సర్వేను ఆసరాగా చేసుకుని వైసీపీ గెలుపుపై బెట్టింగ్ బాబులు మళ్లీ పెద్ద ఎత్తున పందేలు కాసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు టీడీపీ అభిమానులు సైతం గతంలో తాము కాసిన పందేలకు అదనంగా పందేలు కాయడానికి సై అంటున్నారు.

పందేలు ఇలా..

- రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, విజయవాడ తూర్పు, పెనమలూరు నియోజకవర్గాల్లోనూ గెలుస్తుందని తూర్పు నియోజకవర్గానికి చెందిన కొందరు పందెం కాశారు. వీరు సుమారు రూ.50 లక్షలు పందెం కాయడం గమనార్హం. మధ్యవర్తుల సమక్షంలో ఒప్పంద పత్రం రాసుకుని, సాక్షి సంతకాలు చేసుకుంటున్నారు. తాజాగా మరో రూ.25 లక్షలు పందెం కాయడానికీ వీరు సై అంటున్నారు.
- వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని గొల్లపూడికి చెందిన ఆ పార్టీ అభిమాని రూ.75 లక్షలు పందెం కాశారు.
- గొల్లపూడికి చెందిన టీడీపీ అభిమానులు నలుగురు కలిసి.. గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన 151 సీట్ల కంటే ఈసారి కూటమికి ఒక సీటు ఎక్కువ అంటే 152 వస్తాయని పందెం కాశారు. ఈ పందెం విలువ రూ.2 కోట్లు.
- ఫలితాలపై అమెరికాలో సైతం పందేలు జోరుగా సాగుతున్నాయి. పటమటలంకకు చెందిన కొందరు ఎన్ఆర్ఐలు టీడీపీ అధికారంలోకి వస్తుందని 10వేల డాలర్లు పందెం కాశారు.
- వైసీపీ గెలుపుపై నమ్మకం లేక చాలామంది పందేలకు ముందుకు రావట్లేదు. దీంతో టీడీపీ అభిమానులు రూపాయికి రెండు రూపాయలు ఇచ్చేందుకూ సిద్ధమవుతున్నారు. కానూరుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు రూ.2 లక్షలు పందెం కాశారు. ఇందులో ట్విస్ట్ ఏంటంటే టీడీపీ ఓడిపోతే ఈయన అవతలివారికి రూ.2 లక్షలు ఇవ్వాలి. అదే వైసీపీ ఓడిపోతే అవతలి వారు ఈయనకు రూ.లక్ష ఇస్తే సరిపోతుంది.
- విజయవాడ సెంట్రల్‌కు చెందిన ఓ నాయకుడు వైసీపీ అధికారంలోకి వస్తుందని రూ.25 లక్షలు పందెం కాశారు. ఈయన గత ఎన్నికల్లో పందెం కాసి సుమారు రూ.కోటి ఆర్జించారు.

లెక్క పక్కాగా..

ప్రధాన పార్టీల గెలుపోటములను అంచనా వేయడానికి బెట్టింగ్ బాబులు రాజకీయ నిపుణులను రంగంలోకి దించుతున్నారు. వారు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలు, ఎవరికి మద్దతు ఉంటుందనే దానిపై సమాచారాన్ని సేకరించి, దాన్ని విశ్లేషించి ఏ బూత్‌లో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందని లెక్కలు వేస్తున్నారు. పక్కాగా లెక్కలు తేల్చుకున్న తర్వాత బెట్టింగ్ బాబులకు ఆ వివరాలు అందజేస్తున్నారు. వాటి ఆధారంగా రెండు జిల్లాల్లో చాలాచోట్ల బెట్టింగ్‌లు నడిచాయి. ప్రధానంగా ప్రధాన పార్టీలు సాధించే సీట్లు, జిల్లాలో కీలకమైన నేతలు బరిలో ఉన్న స్థానాల్లో వారి గెలుపోటములు, మెజారిటీ ఆధారంగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. అయితే, గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి సగం కూడా బెట్టింగ్‌లు నడవడం లేదనేది బెట్టింగ్ బాబుల మాట. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాలో సుమారు రూ.300 కోట్లు నడిచాయని సమాచారం. ఈసారి అందులో సగం కూడా లేదని చెబుతున్నారు.

వీడియోకాల్ చేసి.. రూ.30 లక్షలు కొట్టేశారు..!

బెజవాడలో మోసపోయిన రిటైర్డ్ ఉద్యోగి


పట్టుబడిన నిందితులతో సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, సీఐ శివాజీ, ఎస్సై మూర్తి

- కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన కొత్త విషయాలు
- విశాఖ కేంద్రంగా బయటపడిన మ్యూల్ గ్యాంగ్ ఆగడాలు
- సైబర్ నేరగాళ్లకు నకిలీ సిమ్‌కార్డుల విక్రయం

ఏడుగురు మ్యూల్ గ్యాంగ్ సభ్యుల అరెస్టు

'మీరు సినీనటి శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాతో రోజూ టచ్‌లో ఉంటున్నారు. ముంబయిలో ఆయన నేరాలు చేసి సంపాదించిన డబ్బు మీ అకౌంట్‌లో జమ అవుతోంది. మీ పేరు మీద ముంబయిలో రెండు బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయి. మీరు ముంబయి క్రైం బ్రాంచ్ ముందు విచారణకు హాజరు కావాలి. ముందు మేం చెప్పిన అకౌంట్‌లో రూ.30 లక్షలు జమ చేయండి. ఈ నేరాలతో ఎలాంటి సంబంధం లేదని తేలితే డబ్బు తిరిగి ఇచ్చేస్తాం.' నగరానికి చెందిన ప్రభుత్వ మాజీ ఉద్యోగికి ఓ వ్యక్తి వీడియోకాల్ చేసి చెప్పిన మాటలివి. ఇది నిజమేనని నమ్మిన ఆయన అవతలి వ్యక్తులు చెప్పినట్టు బ్యాంక్ అకౌంట్లో డబ్బు డిపాజిట్ చేశాడు. అనక మోసపోయానని గ్రహించిన సదరు ఉద్యోగి విజయవాడ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. తీగలాగితే డొంకంతా కదిలినట్టు విశాఖపట్నం కేంద్రంగా సిమ్‌కార్డులు విక్రయించే మ్యూల్ గ్యాంగ్ వివరాలు బయటపడ్డాయి. ఏడుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు శనివారం ఆ వివరాలు వెల్లడించారు.

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల క్రితం సూర్యారావుపేటకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి ముంబయి సైబర్ క్రైం డీసీపీనని చెప్పి ఓ వ్యక్తి వీడియోకాల్ చేశాడు. రాజ్‌కుంద్రా చేసిన మోసాల ద్వారా సంపాదించిన డబ్బు ఆయన అకౌంట్లలో జమ అవుతున్నాయని, ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హిందీ, ఇంగ్లీష్‌లో చెప్పాడు. వాట్సాప్‌లో ఆయన ఎఫ్ఐఆర్, అరెస్టు వారెంట్ కాపీలను పంపించాడు. ఇవి చూడగానే రిటైర్డ్ ఉద్యోగి ఆందోళన చెందాడు. ఫోన్ చేసిన వ్యక్తి నిజంగా డీసీపీ అని భావించాడు. అతడిని బతిమాలుకోగా, దఫదఫాలుగా తాను చెప్పిన అకౌంట్‌లో రూ.30.37 లక్షలు జమ చేయాలని చెప్పాడు. రాజ్‌కుంద్రాతో ఎలాంటి సంబంధం లేదని తేలితే తిరిగి డబ్బు ఇచ్చేస్తామని చెప్పడంతో ఈ రిటైర్డ్ ఉద్యోగికి మరింత నమ్మకం పెరిగింది. డబ్బు ఎంతకీ తిరిగి రాకపోవడం, ముంబయి సైబర్ క్రైం బ్రాంచ్ నుంచి ఎలాంటి ఫోన్లు రాకపోవడంతో ఆయనకు అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు

- మిగతా 6లో

మెరక తొలగించేదెలా..?

కాల్వల చివరి ప్రాంత రైతుల్లో ఆందోళన


నాగాయలంక మండలంలో మెరక వేసిన పొలం

- పొలాల్లో భారీగా పేరుకున్న మట్టి
- తొలగింపు పనులకు అధికారుల నిబంధనలు
- చేసేదేం లేక చాటుమాటుగా తొలగింపు పనులు

కాల్వ చివరి ప్రాంతాల రైతులను మెరక సమస్య వెంటాడుతోంది. నాలుగైదేళ్లకోసారి పంట పొలాల్లో ఉన్న మేటను తొలగిస్తే కానీ, కాల్వల నీరు పొలాల్లోకి చేరే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వేసవిలో సహజసిద్ధంగా ఏర్పడే మేట తొలగింపు కార్యక్రమానికి నిబంధనల పేరుతో అధికారులు అడ్డు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మేటను తొలగించుకోలేక, పొలాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవనిగడ్డ : పంట పొలాల్లోని మేటను తొలగించుకునేందుకు గతంలో వీఆర్వో నుంచి అనుమతి పొందితే సరిపోయేది. రైతులు ముఠాలుగా ఏర్పడి, లాభాపేక్ష లేకుండా కేవలం ముఠా ఖర్చులు, ట్రాక్టర్ కూలీ చూసుకుని మెరక అవసరం ఉన్న రైతులకు మట్టిని తోలేవారు. అయితే, మేటను తొలగించుకునే రైతులు అదే పొలంలో గుట్ట పోసుకోవాలే గానీ, బయటకు తీసుకురావటానికి వీల్లేదని రెవెన్యూ అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో రైతులు తమ పొలాల్లోని మేట తొలగించుకునే వీల్లేక ఇబ్బందులు పడుతున్నారు. చాటుమాటుగా తమ పొలాల్లోని మెరకను తొలగించుకోవాల్సి వస్తోందని, ఇలాంటి సందర్భాల్లో కొందరు అధికారులు, కొన్ని ముఠాలు ట్రాక్టర్ల యజమానులను ఆపి బెదిరిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

తీర గ్రామాల్లో సాగు సాగేదెలా?

నాలుగేళ్లుగా పంట పొలాల్లోని మెరక తీసుకునేందుకు అధికారులు అంగీకరించకపోవటంతో నాగాయలంక, కోడూరు మండలాల్లోని కాల్వ చివరి ప్రాంతాల్లోకి, అవనిగడ్డలోని మెరక భూముల్లోకి సాగునీరు ఎక్కక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా కాల్వ నీటితో పాటు కొట్టుకు వచ్చే ఒండ్రుమట్టి, పొలాన్ని బలోపేతం చేసేందుకు తోలే పెంట పోగుల కారణంగా నాలుగైదేళ్లకు రెండు అంగుళాల మేర పొలంలో మేట వేస్తోందని, ఇలాంటి సందర్భాల్లో మేటను తొలగించుకునే పరిస్థితి లేకపోవటంతో కోడూరు మండలంలోని తీర గ్రామాలైన రామకృష్ణాపురం, ఇరాలి, మందపాకల, పోటుమీద, నాగాయలంక మండలం భావదేవరపల్లి, కమ్మనమోల, చోడవరం, గుల్లలమోద, ఏటిమొగ, పెదపాలెం తదితర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితి తలెత్తితే పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పంట పొలాల్లో పేరుకుపోయిన మేట మెరకను తొలగించేందుకు అనుమతులు ఇవ్వాలని, పొలాల్లో మెరక తొలగించుకునే వారిపై జరుగుతున్న అధికారుల దాడులను, ముఠాల బెదిరింపులను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

విజయవాడలో హనుమాన్ శోభాయాత్ర

జై హనుమాన్




హనుమాన్ జంక్షన్ ఆలయంలో ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయస్వామి

జై హనుమాన్.. నామస్మరణతో జిల్లా మార్మోగింది. హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం రెండు జిల్లాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో హనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పాల్గొన్నారు. సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న రామకోటి నుంచి ఫుడ్ జంక్షన్, మీసాల రాజారావు బ్రిడ్జి, పూర్ణానందంపేట, రైల్వేస్టేషన్, లోబ్రిడ్జి మీదుగా కదిలిన ఈ శోభాయాత్ర కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వరకూ సాగింది. కాగా, హనుమాన్ జంక్షన్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. - సత్యనారాయణపురం

ఆగమేఘాలపై..

ఉమ్మడి కృష్ణాజిల్లా కాంట్రాక్టర్లకు ప్రభుత్వ షాక్

జేజేఎం బిల్లుల నిధులు విడుదల.. సగానికిపైగా మేఘా సంస్థకే..

- మొత్తం రూ.124 కోట్లు ముట్టజెప్పిన ప్రభుత్వం
- జిల్లాలోని ఇతర కాంట్రాక్టర్లకు పైసా విదిల్చింది లేదు..
- ఈఎన్‌సీ కార్యాలయ ముట్టడికి కాంట్రాక్టర్ల పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చింది. అస్మదీయులకే భారీగా చెల్లింపులు చేసింది. దీంతో జిల్లాకు సంబంధించి రూ.50 కోట్ల బకాయిల్లో ఒక్క పైసా కూడా స్థానిక కాంట్రాక్టర్ల చేతికి అందలేదు. అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన బడా కాంట్రాక్టు సంస్థలకు భారీగా చెల్లింపులు జరిపేశారు. ఇందులో ముందు వరసలో మేఘా సంస్థ ఉంది. ఎప్పుడో పనులు చేపట్టి జనవరిలోనే అప్‌లోడ్ అయిన ఉమ్మడి జిల్లా కాంట్రాక్టర్లను కాదని ఇటీవల మార్చిలో అప్‌లోడ్ చేసిన ఈ సంస్థ బిల్లులను ఆగమేఘాలపై చెల్లించారు. మొత్తం నాలుగు బిల్లుల్లో రూ.124 కోట్ల మేర చెల్లించారు.

ఆందోళన దిశగా కాంట్రాక్టర్లు

దీనిపై ఉమ్మడి జిల్లాకు చెందిన చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు భగ్గుమంటున్నారు. తాము అప్పులు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టి పనులు చేశామని, చాలాకాలంగా బిల్లుల చెల్లింపు జరగకపోవటం వల్ల వడ్డీలు కడుతూ భారాన్ని మోస్తున్నామని మండిపడుతున్నారు. ప్రభుత్వ పెద్దల చర్యను నిరసిస్తూ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ అధికారుల వ్యవహారశైలిని తప్పుబడుతూ గొల్లపూడిలోని రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించేందుకు ఉమ్మడి జిల్లా వాటర్ సప్లై కాంట్రాక్టర్లు రంగం సిద్ధం చేస్తున్నారు.

సగానికి పైగా మేఘాకే..

జేజేఎం పనులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ.750 కోట్ల పైబడి బకాయిలున్నాయి. పనులు ఆపేస్తామని కొద్దిరోజులుగా కాంట్రాక్టర్లు అల్టిమేటం కూడా ఇస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం దిగి వచ్చి రూ.206 కోట్లు విడుదల చేసింది. ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం విడుదల చేసిన రూ.206 కోట్లలో సగానికి పైగా రూ.124 కోట్ల మేర ఒక్క మేఘా సంస్థకే బిల్లులు చెల్లించటం గమనార్హం.

మరోమారు రైళ్ల రద్దు

విజయవాడ-గుంటూరు పరిధిలో ఏడు రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైల్వే అధికారులు మరోసారి రైళ్లను రద్దు చేశారు. ఈసారి కూడా మెయింటెనెన్స్ పనుల కారణంగానే రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈసారి విజయవాడ-గుంటూరు సెక్షన్ పరిధిలో ఏడు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. విజయవాడ-గుంటూరు (07464), గుంటూరు-విజయవాడ (07465), గుంటూరు-విజయవాడ (07976), హుబ్బళ్లి-విజయవాడ (17329), విజయవాడ-హుబ్బళ్లి (17330) రైళ్లను ఈనెల 14 వరకు రద్దు చేశారు. అలాగే, రాజమండ్రి-విజయవాడ (07767), విజయవాడ-రాజమండ్రి (07459) రైళ్లను 30వ తేదీ వరకు రద్దు చేశారు.

ఓట్ల లెక్కింపునకు భారీగా భద్రత

కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

- 6లో..

నమో ఆంజనేయం

హనుమజ్జయంతి సందర్భంగా జంక్షన్‌లో, ఇంద్రకీలాద్రిపై స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



హనుమాన్‌జంక్షన్‌లో అభయాంజనేయస్వామికి పంచామృతంతో అభిషేకం చేస్తున్న అర్చకులు



గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు



కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న వీహెచ్‌పీ మాతృశక్తి విభాగం మహిళలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 1: హనుమజ్జయంతి సందర్భంగా శనివారం అభయాంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామికి తెల్లవారుజామున 3గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చక స్వాములు వెంకటరామాచార్యులు, శ్రీనివాసాచార్యులు వేద మంత్రాల మధ్య పంచామృతాభిషేకం చేశాక, ప్రభాత సేవ జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు అప్పన కనకదుర్గాప్రసాద్, సుంకర సుభాష్‌చంద్రబోస్, మేడేపూడి రామ్మోహన్‌రావు, నెరుసు నాగభూషణం, ఈవో కె.శ్రీనివాస్ రథానికి పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి బయలుదేరిన రథం ఏలూరు రోడ్డు, గుడివాడ రోడ్డు, విజయవాడ రోడ్డు, నూజివీడు రోడ్డు మీదుగా సాగింది. విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 9 కలశాలతో అభయాంజనేయస్వామికి నైవేద్యం సమర్పించారు. అనంతరం సాయిబాబా మందిరం నుంచి అంజనేయస్వామి ఆలయం వరకు కలశాలతో శోభయాత్ర నిర్వహించారు. లారీ ట్రాన్స్‌పోర్టర్ కనుమూరి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్సు 20 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, టీడీపీ గన్నవరం, దెందులూరు, మచిలీపట్నం అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్, కొల్లు రవీంద్ర, గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు తదితరులు దర్శించుకున్నారు.

ప్రసాదం లడ్డూలకు వేలం

హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన లడ్డూ ప్రసాదాలకు ఆలయం వద్ద వేలం పాట నిర్వహించారు. లడ్డూ ప్రసాదం వేలం పాట ద్వారా ఆలయానికి రూ.31,700 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో కె. శ్రీనివాస్ తెలిపారు. బోడిచర్ల రాంబాబు సమర్పించిన 25 కేజీల లడ్డూను అప్పన కనక దుర్గాప్రసాద్ రూ.14,400కు, తవ్వా పూర్ణచంద్రరావు ఇచ్చిన 18 కిలోల లడ్డూను ఆలేటి రాజా రూ.10 వేలకు, మరో భక్తుడు అందించిన 10 కేజీల లడ్డూను తాతా వెంకట్రావు రూ.7,300కు పాడారు.



వేలంలో పాడుకున్న లడ్డూ ప్రసాదంతో భక్తులు



ఇంద్రకీలాద్రిపై క్షేత్రపాలకుడికి అర్చనలు

వన్‌టౌన్: హనుమజ్జయంతి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో క్షేత్రపాలకుడిగా ఉన్న అభయాంజనేయస్వామికి శనివారం ప్రత్యేక అర్చనలు జరిపారు. వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం మూల మంత్ర జపాలు చేశారు. మూలమంత్ర హవనంతో పాటు మన్యసూక్త, సుందరకాండ పారాయణలు చేశారు. కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. తొలుత స్వామికి స్నపన చేయించి, అభిషేకాన్ని పూర్తి చేశారు. నూతన వస్త్రాలు, పుష్పమాలలు, నిమ్మకాయ దండలతో అలంకరించారు. హనుమజ్జయంతి సందర్భంగా దత్తత దేవాలయమైన సీతానగరంలోని వీరాంజనేయస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి విగ్రహానికి సింధూర లేపనం రాశారు. తమలపాకులతో అర్చనలు నిర్వహించి అరటి, మామిడి పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

తప్పులు కప్పిపుచ్చి.. బుకాయింపు!

- వేలంలో బ్యాంకు సిబ్బంది బంధువులు లేరట
- గాంధీ బ్యాంకు అధికారుల ప్రకటన
- బ్యాంకు సీఈవో భర్త వేలంలో పాల్గొన్నది వాస్తవం
- రూ.86 లక్షల వరకు పాడింది నిజం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ బందరు రోడ్డులో తాజ్ వివాంత హోటల్‌కు ఎదురుగా ఉన్న మూడంతస్థుల భవనం వేలంలో బ్యాంకుకు నష్టం కలిగించేలా జరిగిన కుమ్మక్కు వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. దీనిపై బ్యాంకు అధికారులు స్పందిస్తూ ఇచ్చిన వివరణలో తమకు రావాల్సిన రుణం రూ.1.80 కోట్లుగా పేర్కొన్నారు. మరి అంత మొత్తం రుణ బకాయి రావాల్సి ఉంటే కేవలం రూ.88 లక్షలకే వేలం ముగించడం వెనుక ఉన్న అదృశ్య శక్తి ఎవరు? రిజిస్టర్ ఆఫీసు ధరల ప్రకారం అప్రూవ్డ్ వాల్యూవర్ నిర్ణయించిన ధర రూ.48 లక్షలే ఉందని, అందుకే రూ.88 లక్షలకే వేలం ముగించామని బ్యాంకు అధికారులు సర్దిచెప్పుకొనే ప్రయత్నం చేస్తు న్నారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన వివరణలోనే అద్దెల రూపంలో రూ.50వేలు వస్తున్నాయని పేర్కొన్నారు. అంటే ఆ భవనం ఉన్న ప్రదేశం ఎంత డిమాండ్ ఉన్న ప్రాంతమో అర్థమవుతుంది. బహిరంగ మార్కెట్‌లో అక్కడ ఆ భవనం విలువ తక్కువలో తక్కువ కోటిన్నర పలుకుతుంది. అలాంటిది రూ.88 లక్షలకే దాన్ని వేలం వేసి, బ్యాంకుకు నికరంగా రూ.కోటి నష్టాన్ని కలిగించారన్నది వాస్తవం.

> గాంధీ సహకార బ్యాంకు అధికారులు తప్పులు కప్పిపుచ్చుకోవడంపై చూపుతున్న శ్రద్ధ వాటిని దిద్దుకోవడంలో చూపడం లేదని బ్యాంకు సభ్యులు విమర్శిస్తున్నారు. కొందరు వైసీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్న బ్యాంకును దివాళా తీయించే దిశగా బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై సహేతుకమైన వివరణ ఇవ్వకుండా తప్పులను కప్పిపుచ్చేలా.. అవినీతి అధికారులను వెనకేసుకొచ్చేలా ఖండనలకే బ్యాంకు అధి కారులు పరిమితం అవ్వడం ఏమిటని సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధం కాదా?

ప్రస్తుతం బ్యాంకు సీఈవో భర్త రఘు వేలంలో పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు, ఉద్యోగులు వారి బంధువులు వేలంలో పాల్గొనకూడదు. కానీ సీఈవో భర్త స్వయంగా వేలంలో పాల్గొని రూ.86 లక్షల వరకు వేలం పాడింది వాస్తవం. బ్యాంకు నిర్వహించిన వేలం రికార్డులను పరిశీలిస్తే ఇది వెల్లడవుతుంది. మరో నలుగురు బ్యాంకు డైరెక్టర్లు, వారి బంధువులతో కలిసి వేలంలో పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం బ్యాంకు సేల్ ఆఫీసర్, బ్యాంకు తరఫున సీఈవో లేదా బోర్డు ఆమోదం పొందిన బ్యాంకు ఉద్యోగి మాత్రమే వేలంలో పాల్గొని వేలాన్ని పర్యవేక్షించాలి. డైరెక్టర్లు వేలంలో పాల్గొనడం, పర్యవేక్షించడం చేయకూడదు.

సేల్ ఆఫీసర్ నిర్లక్ష్యం కాదా?

బ్యాంకు అధికారులు ఇచ్చిన వివరణలో ఐదుసార్లు వేలం నిర్వహించినట్టు, భవన యజమాని వేలం జరగకుండా కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. 2015లోనే హైకోర్టు 25 శాతం బకాయి కట్టే విధంగా స్టే ఉత్తర్వులు ఇచ్చినట్టు అధికారుల వివరణలో తెలిపారు. మరి ఆ మొత్తం కట్టించుకోకుండా సేల్ ఆఫీసర్ ఎందుకు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారు. ఈ ఉత్తర్వు తర్వాత కూడా భవన యజమాని పలుమార్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా వెసులుబాటు కల్పించిన ఘనత సేల్ ఆఫీసర్‌కు దక్కుతుంది. భవన యజమానికి నెలకు రూ.50వేలు అద్దెలు వస్తున్నాయని అధికారులే చెబుతున్నారు. మరి న్యాయస్థానాల ద్వారా ఆ మొత్తాన్ని అటాచ్‌మెంట్ చేసుకునేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదు.

సర్‌ఫేసీ యాక్ట్ పట్టదా?

సర్‌ఫేసీ యాక్ట్ ప్రకారం పాలకవర్గం ఆమోదంతో బ్రాంచి మేనేజర్లు బకాయిదారుల నుంచి ఆస్తులను స్వాధీనం చేసుకుని వేలానికి వెళ్లవచ్చు. సహకార చట్టం పరిధిలో ఉన్న పాత బకాయిలన్నింటినీ ఈ చట్టం పరిధిలోకి తెస్తే సహకార శాఖ నుంచి సేల్ ఆఫీసర్ల రూపంలో సిబ్బందిని తెచ్చుకుని లక్షలాది రూపాయల జీతం ఇవ్వాల్సిన పని బ్యాంకుకు ఉండదు. పైగా బకాయిలు వేగంగా వసూలవుతాయి.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆద్యుడు కురియన్

చిట్టినగర్, జూన్ 1: పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆద్యుడు వర్గీస్ కురియన్ అని, పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాలఫ్యాక్టరీ ఆవరణలో వర్గీస్ కురియన్, మ్యాక్స్ చట్ట రూపకర్త ఎన్టీఆర్, ఏపీ డెయిరీ రంగ వ్యవస్థాపకుడు కాకాని వెంకటరత్నం విగ్రహాలకు చలసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల ఉత్పాదనలో దేశం అగ్రగామిగా నిలవడానికి కురియన్ కృషి చేశారన్నారు. నాణ్యమైన పాలు, పాల పదార్థాలను వినియోగదారులకు అందించడమే ధ్యేయమని ఎండీ కొల్లి ఈశ్వరబాబు అన్నారు.



పాలఫ్యాక్టరీలో వర్గీస్ కురియన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత

- కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

మచిలీపట్నం టౌన్, జూన్ 1: కట్టుదిట్టమైన భద్రత మధ్య 4వ తేదీన కృష్ణా విశ్వవిద్యాలయంలో ఓట్లలెక్కింపు నిర్వహిస్తామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ పేర్కొన్నారు. శనివారం మీడియా సెంటర్‌లో విలేకరులలో వారు మాట్లాడారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ప్రజా తీర్పు అందరూ గౌరవించాలని కలెక్టర్ సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, లెక్కింపులో ఏజెంట్లు సంయమనం పాటించాలని ఎస్పీ పేర్కొన్నారు.

కౌంటింగ్ పరిశీలకులు వీరే..

ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా గన్నవరం నియోజకవర్గానికి ఎస్ఎస్ శివానంద, గుడివాడ నియోజకవర్గానికి బస్సీలాల్ రాణా, పెడనకు అనిల్‌చంద్ర, మచిలీపట్నం నియోజకవర్గానికి జాన్‌కిన్స్‌లే, అవనిగడ్డకు అఖిలేష్‌కుమార్ సింగ్, పామర్రుకు రాజీవ్‌దత్తా, పెనమలూరుకు అభిజిత్ బోస్‌లను ఎన్నికల సంఘం నియమించింది.

నేడు ఓట్ల లెక్కింపుపై శిక్షణ

కృష్ణా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానానికి ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి, పోలింగ్ ఏజెంట్లకు మచిలీపట్నంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపుపై జడ్పీ కన్వెన్షన్ హాలులో, గన్నవరం నియోజకవర్గానికి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో, గుడివాడకు జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో, పెడనకు లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాలలో, మచిలీపట్నానికి నోబుల్ కళాశాల సైన్సు బ్లాక్‌లో, అవనిగడ్డకు చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్‌లో, పామర్రుకు నిర్మలా హైస్కూల్‌లో, పెనమలూరు నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు నోబుల్ కళాశాల లైబ్రరీ బిల్డింగ్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, పామర్రు ఆర్వో శ్రీదేవి, అవనిగడ్డ ఆర్వో బాలసుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ సమన్వయ అధికారి దుర్గాకిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ



కృష్ణా యూనివర్సిటీని సందర్శిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

రెడ్‌జోన్‌గా కృష్ణా యూనివర్శిటీ ప్రాంతం

మచిలీపట్నం టౌన్: ఓట్ల లెక్కింపు నిర్వహించే కృష్ణా యూనివర్శిటీ ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా నిర్ణయించామని ఆ ప్రాంతంలో జూన్ 4న ఎవరూ గుమికూడవద్దని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ సూచించారు. శనివారం ఆయన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని మాత్రమే అనుమతిస్తామన్నారు.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా సెక్షన్లు 30, 144 అమలు

గుడివాడ: కృష్ణాజిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30, 144 అమలులో ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ హెచ్చరించారు. శనివారం నెహ్రూచౌక్ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు చేయొద్దని ఆయన సూచించారు. బాణాసంచా కాల్చొద్దని, ప్రజాజీవనానికి ఆటంకం కలిగితే ఊరుకోబోమని ఎస్పీ హెచ్చరించారు. డీఎస్పీ పి.శ్రీకాంత్, ఒన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విదేశీ పర్యటన ముగించుకుని..

రాష్ట్రానికి తిరిగొచ్చిన జగన్

జాతీయ రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్ ● ప్రయాణికులు, వాహనదారులకు తిప్పలు

గన్నవరం, జూన్ 1: విదేశీ పర్యటనను ముగించుకుని సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి చేరుకున్నారు. ఇంగ్లాండ్‌లోని ఫార్న్‌బరో విమానాశ్రయం నుంచి శుక్రవారం రాత్రి బొంబార్డియర్ గ్లోబల్ 7500 ప్రత్యేక విమానంలో బయలుదేరి శనివారం తెల్లవారుజామున 5.07 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ముందుగా 4.58 గంటలకు వచ్చిన విమానం రన్‌వే పైకి దిగేందుకు విజిబులిటీ లేకపోవటంతో తిరిగి విజయవాడ వరకూ వెళ్లింది. అక్కడ నుంచి మళ్లీ వెనక్కి వచ్చి ల్యాండైంది. విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, జోగి రమేష్, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, కొట్టు సత్యనారాయణ, వెలంపల్లి శ్రీనివాసరావు, తలశిల రఘురాం, రుహుల్లా, మొండితోక అరుణ్ కుమార్, వల్లభనేని వంశీ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం రోడ్డు మార్గాన తాడేపల్లి వెళ్లారు. ఇదిలా ఉండగా గన్నవరం విమానాశ్రయంలోకి జగన్ మీడియాకు తప్ప ఎవరికీ అనుమతి లేదని సెట్‌లో గన్నవరం సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ చెప్పటం గమనార్హం.

వాహనాల నిలిపివేత..జనం బాధలు వర్ణనాతీతం

జగన్ రాకను పురస్కరించుకుని పోలీసులు ట్రాఫిక్‌ను నిలుపుదలచేశారు. విమానాశ్రయం నుంచి గన్నవరం వరకు ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల నుంచి కేసరపల్లి వైపు వరకూ వాహనాలను నిలుపుదల చేయటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున కావటంతో ఎక్కువమంది ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు ఉన్నారు. వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవటంతో రైళ్లు అందవని ఆందోళనచెందారు. విమానం ల్యాండింగ్ కాకముందే జాతీయ రహదారిపై వాహనాలను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు, వాహనదారుల బాధలు వర్ణాతీతంగా మారాయి.



జాతీయ రహదారిపై పోలీసులు నిలిపివేసిన వాహనాలు

వీడియో కాల్ చేసి..

రూ.30 లక్షలు కొట్టేశారు..!

(ఐదోపేజీ తరువాయి..)

ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వీడియో కాల్ ఏ నెంబర్ నుంచి వచ్చిందో విచారణ చేపట్టారు. సైబర్ క్రైం ఏసీపీ ఎస్‌డీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఎస్ఐ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పడింది. వీడియో కాల్ వచ్చిన నెంబర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీఐ సర్వీసు ప్రొవైడర్ నెంబర్ నుంచి ఈ కాల్ వచ్చినట్టు గుర్తించిన పోలీసులు సిమ్‌కార్డు ఏ చిరునామాతో ఉందో అక్కడికి వెళ్లారు. విశాఖపట్నం చిరునామా చూపించడంతో అక్కడికి వెళ్లి విచారణ చేశారు. ఈ సిమ్‌ను ఎక్కడ కొన్నారో కనుగొన్నారు.

ఒకే వేలిముద్రతో రెండు సిమ్‌ల యాక్టివేషన్

కొత్తగా సిమ్‌కార్డు తీసుకునే వారు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ వద్దకు గానీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ వద్దకు గానీ వెళ్లి ఆధార్ ఫొటోస్టాట్ చూపించి బయోమెట్రిక్ వేయాలి. 24 గంటల తర్వాత సిమ్ యాక్టివేషన్ అవుతుంది. ఇలా సిమ్‌ల కోసం వచ్చిన వారి వేలిముద్రతో వారు తీసుకున్న సిమ్‌ను కాకుండా మరో సిమ్‌ను యాక్టివేట్ చేస్తున్నారని గమనించారు. పోలీసుల విచారణలో తాము ఒక సిమ్ కార్డు మాత్రమే తీసుకున్నామని కొందరు వివరించారు. దీంతో అనుమానం మరింత బలపడింది. సిమ్‌కార్డుల కోసం వచ్చిన వారికి ఒకటి అధికారికంగా ఇచ్చి, మరో మ్యూల్ సిమ్‌ను యాక్టివేట్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు గ్యాంగ్ వెలుగులోకి వచ్చింది. విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన రేపాక రాంజీ, నంబాల నితిన్, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన తేలు ప్రణయ్‌కుమార్, నంద రూపేష్, కాగితాల సింహాద్రి, ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన పందిరి సత్యనారాయణ, పాత గాజువాక ప్రాంతానికి చెందిన బండి నారాయణమూర్తిని అరెస్టు చేశారు. నిందితుల్లో రాంజీ వీఐ సర్వీసు ప్రొవైడర్ షోరూంలో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. నితిన్ మొబైల్ సర్వీసింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. విశాఖపట్నం కేంద్రంగా మ్యూల్ సిమ్‌లను యాక్టివేట్ చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

ఒక్కో సిమ్ ఖరీదు రూ.1,500

మ్యూల్ గ్యాంగ్ సిమ్‌కార్డులను సైబర్ నేరగాళ్లకు విక్రయించి భారీగానే సొమ్ము చేసుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు. సర్వీసు ప్రొవైడర్ నుంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు సిమ్‌ను రూ.500కు ఇస్తారు. దీనికి ఎగ్జిక్యూటివ్ మరో రూ.100 లాభం వేసుకుని రూ.600కు డిస్ట్రిబ్యూటర్‌కు విక్రయిస్తాడు. సిమ్‌లను యాక్టివేట్ చేసే క్రమంలో మ్యూల్ సిమ్‌ను సృష్టించిన డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్లు కలిసి సైబర్ నేరగాళ్లకు ఆ సిమ్‌లను విక్రయిస్తున్నారు. ఒక్కో సిమ్‌కార్డును సైబర్ నేరగాళ్లకు రూ.1,500 వరకు విక్రయించారు. ఇలా మొత్తం 30 సిమ్‌కార్డులను సృష్టించినట్టు పోలీసులు గుర్తించారు. వాటిలో 20 సిమ్‌లను సైబర్ నేరగాళ్లకు విక్రయించేశారు. ఇలా సృష్టించిన 998 మ్యూల్ సిమ్‌లను సైబర్ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, రిటైర్డ్ ఉద్యోగి డబ్బు జమ చేసిన ఖాతాల వివరాలను రాబట్టిన పోలీసులు అందులో ఉన్న రూ.1.21 లక్షలను స్తంభింపజేశారు. ఈ ఖాతాను పరిశీలించగా, ఒక్క రోజులోనే రూ.6.2 కోట్ల లావాదేవీలు జరిగినట్టు తేలింది.



గన్నవరం బాలికల హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

బడికొచ్చి కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారు!

- ఒకటో తారీఖున జీతం పడిందా లేదా అని కాకుండా..
- విద్యార్థులకు 70 శాతం మార్కులెందుకు రావడం లేదో చూడండి.. బాధ్యతతో బోధించండి
- గన్నవరం బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులతో విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

గన్నవరం, జూన్ 1: "విద్యార్థులు బడికి వస్తున్నారు. ఉపాధ్యాయులు వచ్చి కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారు. ఒకటో తారీఖున జీతం పడిందా లేదా అని కాకుండా విద్యార్థికి 70శాతం మార్కులు ఎందుకు రావడం లేదనే ఆలోచన చేయండి. అదే మీ పిల్లలకు తక్కువ మార్కులు వస్తే ఏం చేస్తారు. 40 శాతం మార్కులు వచ్చిన వారికి మీకు కంపెనీ ఉంటే ఉద్యోగం ఇస్తారా?" అని గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ప్రశ్నించారు. హైస్కూళ్ల పరిశీలనలో భాగంగా గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల, గొల్లనపల్లి హైస్కూల్‌ను శనివారం ప్రవీణ్ ప్రకాశ్ తనిఖీ చేశారు. తొలుత గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చారు. అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదో తరగతిలో 70శాతం మార్కులు ఎంతమందికి వచ్చాయని ఉపాధ్యాయులను అడిగారు. దీనిపై కొందరు ఉపాధ్యా యులు మొత్తం పర్సంటేజ్ చెప్పారు. దీనిపై ప్రవీణ్ ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికీ బాధ్యత లేదు. బాధ్యతతో విద్యార్థులకు బోధన చేయడం లేదనడంతో డీఈవో తాహెరా సుల్తానా సమాధానం చెప్పబోయారు. నేనేమీ చిన్న పిల్లోడిని కాదు. ఐఏఎస్ ర్యాంకర్‌ని. మీరు చెప్పే సమాధానం ఆఫీసులో కూర్చుని కూడా తెలుసుకోగలనన్నారు. పదో తరగతిలో రిజల్ట్ కావాలని పదేపదే చెబుతున్నా పట్టడం లేదని, ఫౌండేషన్ సరిగా లేని విద్యార్థికి ఆరో తరగతి నుంచే బేసిక్స్ నేర్పుతూ వస్తే రిజల్ట్ ఇలా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా 70శాతం మార్కులు తక్కువ మందికి రావటంపై అయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చే యూనిఫాంను పరిశీలించి కొలతలు వేశారు. సరిపడా వచ్చిందా రాలేదా అని ఎంఈవోలను అడిగారు. ఎంత మందికి ఎంత అవసరమని అడిగితే సరైన సమాధానం చెప్పకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవోలు కె.రవికుమార్, ఆర్.కమల కుమారి, హెచ్ఎం డి.ఝాన్సీరాణి పాల్గొన్నారు. తర్వాత గొల్లనపల్లి హైస్కూల్‌కు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడారు. హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.85

ఏబీవీకి బోడె ప్రసాద్ సత్కారం



పెనమలూరు, జూన్ 1: నిజాయితీ నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన పోలీసు ఉన్నతాధికారి ఏబీ వెంకటేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం అకారణంగా, కావాలని ఇబ్బందులకు గురి చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం పదవీ విరమణ పొందిన ఏబీ వెంకటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. బోడె వెంట వీరమాచినేని పవన్, దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జైహనుమాన్.. జైశ్రీరామ్

- హనుమజ్జయంతి సందర్భంగా మార్మోగిన ఆలయాలు
- వేకువ జామునుంచే స్వామివారికి ప్రత్యేకపూజలు
- వాడవాడలా స్వామివారి శోభాయాత్ర





జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తుల కిటకిట, ఆరుగొలను ఆలయంలో యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ / రూరల్/ గన్నవరం/ ఉంగుటూరు/ ఉయ్యూరు, జూన్ 1 : హనుమజ్జయంతి ఉత్సవాలను రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామిదర్శనానికై భక్తులు తెల్లవారుఝామునుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. జైహనుమాన్, జైశ్రీరామ్ నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. స్వామికి పాలు, పంచామృతాలతో అభిషేకాలు, ఆకు పూజలుచేసి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.

జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులతో అర్చకులు ఆంజనేయస్వామి చిత్రపటంతో పాటు శేషవస్త్రాన్ని యార్లగడ్డకు అందించారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జనసేన నియోజక వర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీని వాసరావు, వేగిరెడ్డి పాపారావు, మొవ్వా వెంకటేశ్వరరావు, ఆట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, చల సాని శ్రీనివాస్, కలపాల రాధాకృష్ణ, మండాడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు మండలంలోని మడిచర్ల అభయాంజనేయ స్వామి దేవస్థానం 25వ వార్షికోత్సవ సందర్భంగా విశేష అలంకరణ నిర్వహించి స్వామి వారికి మహిళలు లక్ష తమల పాకులతో పత్రి పూజ నిర్వహించారు. కొత్తపల్లిలోని భక్తాంజనేయస్వామి వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. దంటగుంట్లలోని ఆలయంలో సర్పంచ్ యజ్ఞవరపు రంగారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుగొలను భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆలయధర్మకర్త పొట్లూరి ప్రసాద్, దంపతులు, పవన్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్ములూరు, మల్లవల్లి, కాకులపాడు, తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



చిక్కవరంలో పూజలు

● ఆరుగొలనులో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ కూటమి అభ్యర్థులైన యార్లగడ్డ వెంకట్రావు, బడేటి రాధాకృష్ణ, వెనిగండ్ల రాము, చింతమనేని ప్రభాకర్, కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్యేలు దాసరి వెంకట బాలవర్ధనరావు, రావి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుగొలను వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో యార్లగడ్డ వెంకట్రావు, బడేటి రాధాకృష్ణ సేవలందించారు. వేలేరు అడ్డరోడ్డు వద్ద కనుమూరి చిన్నరాజు పర్యవేక్షణలో హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

● గన్నవరం మండలం కేసరపల్లి, బుద్ధవరంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని పూజలు చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎంవీఎల్ ప్రసాద్, జాస్తి వెంకటేశ్వరరావు, ముద్దరబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు. చిక్కవరం శ్రీ హనుమత్‌పుర క్షేత్రంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీ కృష్ణ పర్యవేక్షణలో కోలాటం, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పురుషోత్తప ట్నం మర్రి చెట్టు వద్దనున్న ఆంజనేయ స్వామి ఆల యంలో పూజలు చేశారు. ఆలయ అర్చకులు కొండవీ టి హరిశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

● ఉంగుటూరు మండలం తుట్టగుంట మూడురోడ్ల కూడలి అభయాంజ నేయస్వామి విగ్రహం వద్ద సర్పంచ్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, శ్యామల రంగారెడ్డి కుటుంబసమేతంగా స్వామికి అభిషేకాలు, తమల పాకు పూజలు నిర్వహించారు. అనంతరం బిక్కిరెడ్డి బ్రహ్మారెడ్డి, బొమ్మారెడ్డి రాధాకృష్ణారెడ్డి, పాటూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తేలప్రోలు దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రధానార్చకులు స్వర్ణసాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో స్వామివారి శోభా యాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. కమిటీ పెద్దలు సోమిశెట్టి సత్యనారాయణ, హేమసుందరరావు, భూమా శ్రీనివాసప్రదీప్, దేవత నాగేశ్వరరావు, మాదుగుల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



తేలప్రోలు దాసాంజనేయస్వామి ఆలయంలో..



ఉయ్యూరు కాటూరు రోడ్డులో వైవీబీ పూజలు

● ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించారు. కాటూరురోడ్డు హనుమాన్‌నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన ప్రారంభించి మాట్లాడుతూ, హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. బస్‌స్టాండ్ సెంటర్ ఆంజనేయస్వామి ఆలయం, కడవకొల్లు, పలుగ్రామాల్లో ఆంజనేయ స్వామి మందిరాల వద్ద హనుమజ్జయంతి వేడుకగా నిర్వహించి అన్న సమారాధన చేశారు.



చంద్రబాబును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన సాయికల్యాణి

రాష్ట్రాభివృద్ధికి యువత, మహిళలే కీలకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 1 : రాష్ట్రాభివృద్ధికి యువత, మహిళలే కీలకపాత్ర పోషించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించినట్లు తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి తెలిపారు. హైదరాబాద్‌లోని చంద్రబాబునాయుడు నివాసంలో శనివారం కుమారుడు సాయిశోభన్ చౌదరితో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు తమ కుమారుడికి యువత కీలక పాత్ర పోషిస్తూ రాష్ట్రాభివృద్ధితో పాటు కుటుంబ అభివృద్ధికి పాటుపడాలని సూచించారని సాయికల్యాణి తెలిపారు.

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలకు ఏ గ్రేడ్

ఉయ్యూరు, జూన్ 1 : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలకు నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) నుంచి ఏ గ్రేడు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్ తెలిపారు. కళాశాలలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20, 21 తేదీల్లో మధ్యప్రదేశ్ రేవాలోని ఏపీఎస్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రామ్‌నివాస్ పటేల్ అధ్యక్షతన పశ్చిమబెంగాల్ కళ్యాణిలోని కళ్యాణి యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శీతల్‌కుమార్ చటోపాధ్యాయ, ముంబైలోని మండలీస్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ గోపాల్ కలకోటితో కూడిన ముగ్గురు సభ్యుల బృందం కళాశాలలో అన్ని విభాగాలను పరిశీలించి బెంగళూరులో నాక్ సంస్థకు నివేదిక సమర్పించినట్టు తెలిపారు. నివేదిక పరిశీలించిన సంస్థ కళాశాలకు ఏ గ్రేడు ప్రకటించిందని, జిల్లాలో ఏ గ్రేడు సాధించిన ఏకైక కళాశాలగా ఏజీ అండ్‌ఎస్ జీఎస్ కళాశాల నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీరామ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, ఇతర సిబ్బందిని కళాశాల ప్రతినిధులు అభినందించారు.

కీళ్లవాతంపై అవగాహన

పటమట, జూన్ 1: కీళ్లవాతం జబ్బునే వైద్య భాషలో రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటారని, కీళ్లవాతం జబ్బు మహిళల్లో అధికమని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ జి. మమత పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె 'కీళ్లవాతం- నొప్పులు 'అనే అంశంపై ప్రసంగించారు. మమత మాట్లాడుతూ ఇది ఆటోఇమ్యూన్ కోవకి చెందిన దీర్ఘకాలిక వ్యాధి అని తెలిపారు. కీళ్లవాతం చిన్న వయస్సులోనే వస్తుందని, చిన్న జాయింట్లకి కీళ్ల వాతం రావడం ఎక్కువని అన్నారు.

ఆకట్టుకున్న పోలీసుల మాక్‌డ్రిల్

● ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసిన పోలీసులు



భాష్పవాయువును ప్రయోగించి మంటలను అదుపు చేస్తున్న పోలీసులు

గన్నవరం, జూన్ 1 : ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకుని గన్నవరం పోలీసులు గాంధీబొమ్మ సెంటర్‌లో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు ఒక రాజకీయ పార్టీ నాయకుడిని అరెస్టు చేశారు. అతనిని విడిపించాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గాంధీబొమ్మ సెంటర్ దగ్గర ఆందోళన చేపట్టారు. అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు ఉండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులు టైర్లుకాల్చి విధ్వంసానికి పాల్పడేందుకు కుట్ర పన్నుతున్నారు. విషయం తెలుసుకున్న గన్నవరం సీఐ ప్రసాద్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అధికార బృందం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుందని గ్రహించిన అధికారులు సివిల్, ఏఆర్ పోలీసు లను, అగ్నిమాపక వాహనం, వైద్య అధికారులు, సిబ్బందిని పిలిపించారు. ఆందోళనకారులను వెనక్కి వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆందోళనకారులు టైర్లు కాల్చి రాళ్ల విసిరారు. పోలీసులు భాష్పవాయువును ప్రయోగించి మంటలను అదుపు చేశారు. ఆందోళన కారులను చెదరగొట్టేందుకు గాలిలో కాల్పులు జరిపారు. అప్పటికి రాళ్ల రువ్వటంతో లాఠీచార్జ్ చేసి ఆందోళన కారులను చెదరగొట్టారు. ఈ లాఠీ ఛార్జ్‌లో పలువురు గాయపడటంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఇలా పోలీసులు ముందుగా ప్రజలని అప్రమత్తం చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తగిన చర్యలు తప్పవని గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక పోలీస్ అధికారి ఎస్పీ కె.ఈశ్వర్ రావు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 144సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజు ఎవరైన అల్లర్లు సృష్టించినా, గొడవలకు పాల్పడినా, సహించేది లేదని హెచ్చరించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, డీఎస్పీ జయసూర్య, సీఐలు కెవిఎస్‌వి ప్రసాద్, నవీన్ నరసింహమూర్తి, పెద్దురాజు, ఎస్సైలు కనకదుర్గ, రవిచంద్ర, పైడిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలజడులు సృష్టిస్తే ..

ఉంగుటూరు : ఓట్ల లెక్కింపు రోజు గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా అల్లర్లు, అలజడులు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆత్కూరు ఎస్సై ఏ.పైడిబాబు హెచ్చరించారు. తేలప్రోలులోని జోసఫ్ నగర్‌లో శనివారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తేలప్రోలులో విజిబుల్ పోలీసింగ్‌లో ఎస్సై పైడిబాబు

సమస్యలు పరిష్కరించాలి



విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

గన్నవరం, జూన్ 1: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్‌కు శనివారం గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో వినతిపత్రాన్ని అందజేశారు. కనీస వేతనం పదివేలు ఇవ్వాలని, మెనూఛార్జిల కు రూ.20వేలు ఇవ్వటంతో పాటు గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పాఠశాలలో ఫస్ట్ ఎయిడెడ్ కిట్లు ఏర్పాటు చేసి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సెలవులు ఇవ్వటంతో పాటు మెటర్నీటి బెనిఫిట్స్ ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. సంఘ నాయకులు జి.సమ్మక్క, పి.రూతుకుమారి, ఎం.వరలక్ష్మీ, జి.పాండురంగమ్మ, జంపన సుజాత పాల్గొన్నారు.

ఘనంగా అనుమోలు జన్మదినం



అనుమోలు ప్రభాకర్‌కు కేక్ తినిపిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 1 : టీడీపీ సీనియర్ నేత అనుమోలు ప్రభాకరరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో అభిమానుల మధ్య బోడె ప్రసాద్ అనుమోలు జన్మదిన కేకును కోసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు అనుమోలును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోడె సురేష్, మంచినేని పరమేష్, అంగిరేకుల మురళి, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, సుబ్బారావు, ఆచంట వెంకటచంద్ర, మల్లంపాటి విజయలక్ష్మి, కొమ్మినేని వెంకటేష్, మేడసాని రత్నకుమారిపాల్గొన్నారు.

పుస్తకపఠనం దినచర్య కావాలి

ఉంగుటూరు, జూన్ 1 : పుస్తకపఠనం ప్రతి విద్యార్థి జీవితంలో నిర్దిష్టమైన దినచర్య కావాలని, నిత్యం పుస్తకాలు చదవడం వల్ల మానసిక ఒత్తిడులు, డిప్రెషన్లు దూరమవుతాయని తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ గ్రంథాలయాధికారులు బి.శ్రీనివాసరావు, బీవీ కృష్ణారావు, యు.చంద్రశేఖరరావు, ఎల్.హరికృష్ణ అన్నారు. శనివారం మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు మనోల్లాసం కలిగించే పలు ఆటపాటలు నేర్పించారు.



మానికొండ గ్రంథాలయంలో చక్కని చేతిరాతపై శిక్షణ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.85

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 1 : ఓట్ల లెక్కింపు సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని బందరు ఆర్డీవో, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.వాణి అన్నారు. నోబుల్ కళాశాలలో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అధికారులకు, సిబ్బందికి శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వాణి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమంతో ప్రారంభమవుతుందన్నారు.


ఈడేపల్లిలో హనుమజ్జయంతి వేడుకల్లో రవీంద్ర


అవనిగడ్డలో బుద్ధప్రసాద్ పూజలు


పెదప్రోలు ఆంజనేయస్వామి ఆలయంలో..


గుడివాడలో విశేష పూజలు


పెడన ఆంజనేయస్వామి ఆలయంలో..


చల్లపల్లి పంచముఖ అభయాంజనేయస్వామి

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

మచిలీపట్నం టౌన్, జూన్ 1 : హనుమజ్జయంతి సందర్భంగా నగరంతోపాటు పలు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. పరాసుపేటలో సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయంలో ఈవో టివివి మోహనరావు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈడేపల్లిలో ఆంజనేయస్వామిని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఆళ్ల మాధవ తదితరులు దర్శించుకున్నారు. బచ్చుపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సింగరాజు కల్యాణి, కాళీపట్నపు ఉమ, ఎల్.విజయలక్ష్మి, విశ్వనాథం శాంతకుమారి భక్తి గీతాలు గానం చేశారు. డాక్టర్ బి ధన్వంతరీ ఆచార్య, లంకిశెట్టి బాలాజీ, లయన్ జి రామబ్రహ్మం, రాధాకృష్ణమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గొడుగుపేట, సుల్తానగరం, ఫతుల్లాబాద్ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు జరిగాయి. **పెడన :** రామలక్ష్మీ వీవర్స్ కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. పేరుబోయిన వెంకట నరసయ్య, నాగలక్ష్మి దంపతులు స్వామి వారికి క్షీరాభిషేకం, ఆకుపూజ, సింధూర పూజ, లక్ష్మీగణపతిహోమం నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్ర అట్టహాసంగా జరిగింది. భారీ అన్నసమారాధన నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్, అలుగురి రామాంజనేయులు, బుద్దే నాగమల్లేశ్వరరావు, వీణం శ్రీనివాసులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణంలో గల ఆంజనేయ స్వామి ఉపాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించారు. కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు.కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ శనివారం గూడూరు మండలం కంకటావ, శారదాయిపేట, ముక్కొల్లు, ఆకులమన్నాడు, గంధ్రం ఆంజనేయ స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. **పెడన రూరల్ :** చేవేంద్ర ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పలకలవగుంట, పెనుమల్లి, చెన్నూరు, కూడూరు, కొంకేపూడి, నడుపూరు, బల్లిపరు, నందమూరు, గౌడపాలెం కాకర్లమూడి, లంకలకలవగుంట ఆంజనేయ స్వామి దేవాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. **బంటుమిల్లి :** అర్తమూరులో ఆంజనేయస్వామి కల్యాణం నిర్వహించి భారీ అన్నసమారాధన చేశారు. ముంజులూరులో అన్న సమారాధన జరిగింది. మణిమేశ్వరం రాజులపేటలో హనుమాన్ జయంతి ఘనంగా జరిపారు. పాశ్చాపురం సువర్చాల సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ వ్రతాలు జరిగాయి. బంటుమిల్లి రామాలయం , తుమ్మిడి తదితర ప్రాంతాలలో హనుమాన్ జయంతి నిర్వహించారు. **గుడివాడ :** పెద ఎరుకపాడులో దాసాంజనేయస్వామిదేవస్థానంలో హనుమజ్జయంతి ఘనంగా జరిపారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ దారపురెడ్డి మణేశ్వరరావు, అర్చకులు దేవులపల్లి మారుతీ స్వామినాథ శాస్త్రి, కమ్మిలి సుబ్రహ్మణ్యం, పాలడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు. హిందూ చైతన్యవేదిక, ఆజాద్ హిందూ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీహనుమత్‌జయంతి సందర్భంగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. కమిటీ సభ్యులు శ్యాంసుందర్, చంద్రశేఖర్‌రెడ్డి, మూడెడ్ల శ్రీధర్, యక్కలి మణిదీప్, జగన్, సానా వాసు, రవి, గుర్రం మురళీ, యోగా శ్రీనివాస్, వేమూరి త్రినాథ్ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** వేమవరం కొండాలమ్మ ఆలయం దత్తత రెడ్డిపాలెం అభయాంజనేయ స్వామికి తమలపాకుల పూజ నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణం, గ్రామోత్సవం జరిగాయి. గుడ్లవల్లేరు వార్పు రోడ్డు దాసాంజనేయ స్వామి ఆలయంలో విశేషపూజలు, హోమం నిర్వహించారు. అంగలూరు (కొత్తపేట) అభయాంజనేయ స్వామికి పూజలు జరిపి, అన్నసమారాధన నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణచేశారు. **అవనిగడ్డ :** అభయాంజనేయస్వామివారి ఆలయం వద్ద, తొమ్మిదో వార్డు ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పూజలు నిర్వహించారు. తొమ్మిదో వార్డులో అన్నసమారాధన నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ స్వామికి విక్కుర్తి శ్రీనివాస్ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. వరుచూరి దుర్గా ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్ :** మండలంలోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకనూరు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదుమూడి, వేకనూరు తదితర ప్రాంతాల్లో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. **నాగాయలంక :** అంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భజనలు, అన్నసంతర్పణ చేశారు. **కోడూరు :** వంతెన సెంటర్ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి 10 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. నరసింహాపురం, జయపురం, లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి, మాచవరం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమాన్ చాలీసా పారాయణం గావించి, అన్నసమారాధన చేశారు. మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, గుడివాక శివరావు, మత్తి వెంకటేశ్వరరావు, ముత్తిరెడ్డి పోతురాజు, కోట నాగేశ్వరరావు, కూరాకుల ప్రసాద్, అప్పికట్ల లక్ష్మీ, అప్పికట్ల సుబ్రహ్మణ్యం, నరసింహశెట్టి మాణిక్యాలరావు, నాగేశ్వరరావు, ముత్తిరెడ్డి అర్జునరావు పాల్గొన్నారు. **మోపిదేవి :** పెదప్రోలు సువర్చలా సమేత ఆంజనేయస్వామిని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. అర్చకులు, గ్రామస్థులు శ్రీనివాసరావు దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. వెంకటాపురం, అన్నవరం, మెరకనపల్లి, మోపిదేవివార్పు వద్ద హనుమాన్ జయంతి నిర్వహించారు. **చల్లపల్లి :** బస్టాండ్ సెంటర్ పంచముఖ అభయాంజనేయస్వామి దేవాలయం, అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ప్రసన్న భక్తాంజనేయ స్వామి, నారాయణరావునగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భం గా ప్రత్యేక పూజలు జరిగాయి. వక్కలగడ్డ, రామానగరం, లక్ష్మీపురం, మం గళాపురం, పురిటిగడ్డ, మాజేరు తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామ ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. చల్లపల్లి శ్రీప్రసన్న భక్తాంజనేయస్వామి ఆలయం, రామానగరం సెంటరులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. **కూచిపూడి :** అడ్డరోడ్డు అంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యే క పూజల అనంతరం అన్నసమారాధన జరిగింది. కోసూరు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కూచిపూడిలో విశేష పూజలు జరిగాయి. మొవ్వ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. చినముత్తేవి, మొవ్వపాలెం, కాజ, కోసూరు, నిడుమోలు, ఆవిరిపూడి తదిరత గ్రామాల్లోని ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. **తోట్లవల్లూరు :** భద్రిరాజుపాలెం, యాకమూరు, గరికపర్రు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భద్రిరాజుపాలెం ఆలయం వద్ద అన్నసమారాధన పాల్గొన్నారు. **పమిడిముక్కల :** గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అన్న సమారాధనలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు.


పమిడిముక్కలలో హనుమజ్జయంతి వేడుకల్లో మహిళలు


గుడ్లవల్లేరు దాసాంజనేయస్వామి


అర్తమూరులో ఆంజనేయస్వామి కల్యాణం


చేవేంద్రలో...


భద్రిరాజుపాలెంలో అన్నసమారాధన

హనుమత్‌తత్వం ఆదర్శనీయం

పామర్రు : హనుమత్‌తత్వం నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని దేవదాయశాఖ డీసీ ఎం.విజయరాజు అన్నారు. ఉంగ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వీరాంజనేయ దేవస్థానంలో శనివారం జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారికి విశేష అభిషేకాలు, నాగసింధూర, లక్ష తమలపాకుల అర్చన అనంతరం భారీగా అన్నసమారాధన నిర్వహించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ డి.శాంతి తదితరులు పాల్గొన్నారు. కనుమూరు అభయాంజనేయస్వామి, పామర్రు వీరాంజనేయస్వామి, అడ్డాడ, కురుమద్దాలి బుచ్చమ్మ ఆశ్రమం, ముళ్లపూడి ఆంజనేయ స్వామి దేవాలయాల్లో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు.


ఉంగ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వీరాంజనేయ దేవస్థానంలో పూజలు

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం : వెనిగండ్ల

గుడివాడ రూరల్, జూన్ 1 : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించటానికి కృషి చేస్తానని గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. బిళ్లపాడు పంచాయతీ పరిధి చిన ఎరుకపాడులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. హనుమజ్జయంతి సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించటం సంతోషకరమన్నారు. జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడే నిమ్మగడ్డ సత్యసాయి, సూరగాని సూరిబాబు, విజయేంద్ర, కనకదుర్గయ్య, చిన ఎరుకపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.


కబడ్డీ జట్టు విజేతలతో వెనిగండ్ల రాము

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి సహకారం

చల్లపల్లి, జూన్ 1 : నారాయణరావునగర్ ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి సహకారం అందిస్తామని స్వచ్ఛ చల్లపల్లి రథ సారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి తెలిపారు. నారాయణరావునగర్‌లోని ముస్లిం స్మశాన వాటికను డీఆర్కే దంపతులు శనివారం పరిశీలించారు. అభివృద్ధి పనులపై కమిటీ పెద్దలతో చర్చించారు. ప్రధాన గేటు, నమాజ్ షెడ్ నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. డీఆర్కే దంపతుల ఔదార్యానికి ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు. గౌసియా మసీదు అధ్యక్షుడు.షరీఫ్, కార్యదర్శి మీర్, ఇబ్రహీం, బాజీ, ఖాజావలి, కరీముల్లా, అబ్దుల్ రహీం, హసేన్, జిలానీ పాల్గొన్నారు.


ముస్లిం నాయకులతో మాట్లాడుతున్న డీఆర్కే దంపతులు

విద్యార్థులకు తపస్వి ఫౌండేషన్ ప్రోత్సాహకాలు

పమిడిముక్కల, జూన్ 1 : పిన్నమనేని తపస్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు శనివారం అందజేశారు. తపస్వి జయంతిని పురస్కరించుకుని కృష్ణాపురంలో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో చోరగుడి, పమిడిముక్కల, జీసస్ హైస్కూల్ విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక బహుమతి, షీల్డ్ ట్రస్టు నిర్వాహకులు పిన్నమనేని వెంకట గోపాలకృష్ణారావు అందజేశారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగితే చర్యలు


ధూళిపూడిపాలెం గ్రామస్థులతో మాట్లాడుస్న ఎస్సై

పమిడిముక్కల, జూన్ 1 : మండల పరిధిలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ధూళిపూడిపాలెంలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెలువడిన తరువాత ఏ విధమైన ర్యాలీలు, విజయోత్సవాలు జరుపరాదని హెచ్చరించారు. **గుడివాడ :** ధనియాలపేటలో శుక్రవారం రాత్రి గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ సూచనల మేరకు ఒన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. వేరే ప్రాంతాల నుంచి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చి ఉంటే వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాకు నిబంధనలు తగదు

నాగాయలంక, జూన్ 1 : చేపల వేట నిషేధపు కాలం జీవన భృతిని మత్స్యకారులకు చెల్లించేందుకు విధించిన నిబంధనలనపు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి, టీడీపీ జిల్లా నేతలకనం నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ వద్ద జీవన భృతి అందడం లేదని మత్స్యకారులు ఆయనకు చెప్పారు. త్వరలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వంలో మత్స్యకారులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు. కర్రి కృష్ణమూర్తి, కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

సీడీపీవోగా సుధారాణి

కూచిపూడి, జూన్ 1 : మొవ్వ ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవోగా డి.సుధారాణి శనివారం బాధ్యతలు చేపట్టారు. బంటుమిల్లి ప్రాజెక్టు అదనపు సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న ఆమె ను మొవ్వ ప్రాజెక్టుకు ఇన్‌ఆచార్జిగా నియమించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

పెడన : ప్రతి విద్యార్థి పాఠశాలలో తప్పని సరిగా మధ్యాహ్న భోజనం చేసేలా పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన, రుచికరమైన వంటలు చేయాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వి.మనోహరనాయక్ సూచించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల వంట ఏజెన్సీలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం తయారీపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవో దుర్గాప్రసాద్, ఎంఈవో -2 వై.వి. హరనాథ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండిహారం సమర్పణ

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి చోడవరం గ్రామానికి చెందిన చైతన్య, కుటుంబసభ్యులు వెండిహారం సమర్పించారు. శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో ఎస్.ఎస్.చక్రధరరావుకు వెండి హారాన్ని అందజేశారు.

దేవదాయ ధర్మదాయ శాఖ

కృష్ణాజిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ మచిలీపట్నం డివిజన్ పరిధిలో గల ఈ క్రింది తెలిపిన దేవస్థానములకు చెందిన భూములను నగదు కౌలు టెండరు కం బహిరంగ వేలం పాటలు ప్రకటన.

వ. నెం.	దేవస్థానము పేరు గ్రామము మరియు మండలం	భూములు ఉన్న గ్రామము	విస్తీర్ణం య-సెంట్లు	బహిరంగ వేలం పాట జరుగు ప్రదేశము తేది, సమయం
1	శ్రీ గణపేశ్వరస్వామి వారి దేవస్థానము గణపేశ్వరం గ్రామము, నాగాయలంక మండలం	తలగడదీవి టి. కొత్తపాలెం	28-91 4-32	శ్రీ గణపేశ్వరస్వామి దేవస్థానం వద్ద ది. 5-6-2024 ఉదయం 10 గంటలకు
2	శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానం గణపేశ్వరం గ్రామం, నాగాయలంక మండలం	గణపేశ్వరం తలగడదీవి	2-00 22-28	శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానం వద్ద ది. 5-6-2024 మధ్యాహ్నం 2 గంటలకు
3	శ్రీ భవన్నారాయణ స్వామి వారి దేవస్థానం భావదేవరపల్లి గ్రామం, నాగాయలంక మండలం	భావదేవరపల్లి నంగేగడ్డ	63-97 8-24	శ్రీ భవన్నారాయణ స్వామి వారి దేవస్థానం వద్ద ది. 7-6-2024 ఉదయం 10 గంటలకు
4	శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానం సంగమేశ్వర గ్రామం, నాగాయలంక మండలం	సంగమేశ్వరం	45-66	శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానం వద్ద ది. 7-6-2024 మధ్యాహ్నం 3 గంటలకు

సి.హెచ్. సుధాకరరావు, కార్యనిర్వాహణాధికారి, సెల్ నెం. 9949492410

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

కోడూరు, జూన్ 1 : విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని జనసేన పార్టీ నాయకులు విద్యుత్ శాఖాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఏఈ గోపికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మర్రె గంగయ్య మాట్లాడుతూ 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కూడా అర్థరాత్రి వేళ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆక్వా రైతులు సైతం పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనసేన పార్టీ నాయకులు కొండవీ సునీత, కోట రాంబాబు, పూతబోయిన కరుణకుమార్, పూతబోయిన లక్ష్మణరావు, టీడీపీ నాయకులు కాగిత రామారావు, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, గల్లా బాబి పాల్గొన్నారు.



కొత్తమాజేరులో మెగా వైద్యశిబిరం నేడు

చల్లపల్లి, జూన్ 1 : డాక్టర్ కాగిత లక్ష్మీ నరేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తమాజేరు గ్రామంలో కాగిత వారి ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుండె, మెదడు వ్యాధులతోపాటు జనరల్ మెడిసిన్ విభాగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించనున్నారు. డాక్టర్ కాగిత కృష్ణచంద్‌తోపాటు గుండె నరముల వైద్యులు, డెంటల్ సర్జన్‌లు శిబిరంలో పాల్గొని సేవలందిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచిమధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు.కొత్తమాజేరు, పాతమాజేరు, భోగిరెడ్డిపల్లి, చిన్నాపురం, మంగళాపురం, చల్లపల్లి ప్రాంత ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

అవనిగడ్డ రూరల్, జూన్ 1 : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తక్షణమే ఇవ్వాలని బీజేపీ కౌలు రైతు సంఘం కన్వీనర్ జి.వి.నగరాయులు విజ్ఞప్తి చేశారు.

దక్షిణ చిరువోలులంకలో ఆయన కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సబ్సిడీలు పొందాలంటే గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు తుంగల చంద్రశేఖర్, కౌలు రైతులు పాల్గొన్నారు.

కౌంటింగ్ శిక్షణకు అందరూ హాజరు కావాలి

పామర్రు : పామర్రు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మచిలీపట్నం నిర్మల హైస్కూల్లో ఆదివారం జరిగే ఎన్నికల కౌంటింగ్ శిక్షణ తరగతులకు ఎంపిక చేసిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల అధికారి బీశ్రీదేవి శనివారం పేర్కొన్నారు. నిర్దేశించిన సమయానికి అధికారులు, సిబ్బంది శిక్షణ కేంద్రానికి చేరుకోవాల్సిందిగా సూచించారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోడూరు, జూన్ 1 : ఊటగుండం అగ్నిబాధిత బెల్లంకొండ రత్నకుమారి కుటుంబానికి బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చెన్ను రంగారావు ఆర్థిక సాయమందించారు. తన సతీమణి దివంగత చెన్ను ఉమారాణి పుట్టిన రోజు సందర్భంగా రూ.5 వేలను బాధిత కుటుంబానికి అందించారు. రామకృష్ణాపురం గ్రామప్రముఖులు అద్దంకి పాండురంగారావు, గొరిపర్తి శ్రీనివాసరావు, బీసీ సంఘ నేత వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

నాగాయలంక : మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఏపీవో టి.వి.ఎన్.ముత్యాలు తెలిపారు. పంటబోదెలు, పంటకాల్వలు, మురుగు కాల్వల్లో పూడికతీత, చెరువుల్లో పూడికతీత, పంట నీటి సేద్యపు గుంటలు పనులు చేస్తున్నామన్నారు. మండలంలో 122 పనులకు 4,417 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నట్లు ముత్యాలు వివరించారు. భావదేవరపల్లిలో అర్జా రమేష్ పొలంలో సేద్యపు గుంట పనులను చేసినట్లు తెలిపారు.